ప్రజాశక్తి
శనివారం 21 జనవరి 2023
5
పార్వతీపురం మన్యం



23 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

విజయనగరం టౌన్ : విజయనగరం జిల్లా రాష్ట్ర అండర్ 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలకు వేదికగా మారింది. నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈనెల 23 నుంచి 25వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. జిల్లా విద్యా శాఖ,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు ఇప్పటికే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్ వి రమణ, అలుగోలు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు సారథ్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పాత 13 జిల్లాల నుంచి 26 బాల బాలికల జట్లు రానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న పోటీలకు నాలుగు కోర్టులు సిద్ధం చేశారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు బాలురుకు జెడ్పి హై స్కూల్, బాలికలకు సతివాడ మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల లో వసతి ఏర్పాటు చేశారు. సుమారుగా రూ.5లక్షలు వరకు ఖర్చు అయ్యే ఈ పోటీలను దాతలు సహకారంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

లక్ష్యం కొండంత... కొన్నది గోరంత

- కొనుగోళ్లు లేక అన్నదాతలు అవస్థలు
- ఎక్కడి ధాన్యం అక్కడే... కాపలా కాయలేక కష్టాలు



చలివేంద్ర గ్రామంలో కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

ప్రకృతి విపత్తులను ఎదుర్కొని ఆరుగాలం కష్టించి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో అన్నదాత నానా అవస్థలు పడుతున్నాడు. ప్రతి ధాన్యం గింజను విడిచి పెట్టకుండా రైతు నుంచి కొనుగోలు చేస్తామన్న అధికారుల, ప్రభుత్వ ప్రకటనలకు, ఆచరణకు ఇసుమంతైనా పొంతనలేదు. దీంతో అన్నదాత ఆఖరుకు దళారులనే ఆశ్రయించి నష్టాలకు పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఈ ఏడాది సుమారు 15వేల ఎకరాలకు పైగా వరిసాగైంది. గతేడాది కంటే ఈ ఏడాది పంట దిగుబడి బాగుందని అన్నదాతలు చెబుతున్నారు. అయితే మండలంలో 19 రైతు భరోసా కేంద్రాల నుంచి 33 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకూ కేవలం 2100మంది రైతుల నుంచి కేవలం 14 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మిగతా లక్ష్యం సగానికిపైగానే ఉంది. మరోవైపు ధాన్యం కొనుగోళ్లను నిలిపివేస్తామని అధికారులు ప్రకటిస్తుండడంతో రైతులు ఆందోళన నెలకొంది. ధాన్యం కొనుగోళ్లను నిలిపివేస్తే తమ ధాన్యం ఏం చేయాలో తెలియక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

దళారుదే హవా

మండలంలో ధాన్యం కొనుగోలు లేకపోవడంతో దళారుల హవా కొనసాగుతుంది. వీరి నిర్మించిన ధరకే అన్నదాతలు ధాన్యం విక్రయాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం 80,180 కిలోలకే అన్నదాతల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ దళారులు 84 కిలోల ధాన్యాన్ని తూనికలు వేసి తమ శ్రమను దోచుకుంటున్నట్లు పలువురు అన్నదాతల ఆరోపిస్తున్నారు. గోనె సంచులు, రవాణా, హమాలీల ఛార్జీలు, తూనికలు అన్నీ దళారులే చూసుకొని అన్నదాతకు రూ.1450 లెక్క కడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నెట్ క్యాష్ ఇస్తే రూ.1400 లేకపోతే బ్యాంకు ఖాతాలో జమ చేస్తే రూ.1450 చెల్లిస్తామని చెబుతున్నారు. మరోవైపు వీరఘట్టంలో మిల్లర్ల బ్యాంకు గ్యారంటీలు కట్టకుండా వ్యాపారులుగా మారి అన్నదాతల శ్రమను నిలువునా దోచుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం వ్యవసాయ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు అన్నదాతలు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోరు ఉన్న వాడిదే ఊరు అన్న చందంగా వ్యవసాయ అధికారులు వ్యవహరిస్తున్నట్లు పలువురు అన్నదాతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పండిన పంట ఇప్పటివరకు కొనుగోలు లేకపోతే తమ పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. దళారులకే వ్యవసాయ అధికారులు కొమ్ముకాస్తున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నవెలువెత్తు తున్నాయి.

ఎక్కడికి అక్కడే ధాన్యం బస్తాలు నిల్వలు

మండలంలో ధాన్యం కొనుగోలు లేకపోవడంతో ఎక్కడికక్కడే ధాన్యం బస్తాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిమిస్తున్నాయి. మండలంలోని చలివేంద్రిలో ఇప్పటికే 4వేలకు పైబడి ధాన్యం బస్తాలు కళ్లాల్లో దర్శనమిస్తున్నాయి. ఈనెల 6న చలివేంద్రికి చెందిన రైతులు ధాన్యం కొనుగోలు విషయమై మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం విదితమే. దీంతో అధికారులు స్పందించి 10 నుంచి 15 వాహనాల వరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు చేతులు దులుపుకున్నారు. ఇంకా ఈ గ్రామంలో 20 వాహనాలకు సరిపడా ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ధాన్యం బస్తాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. చివరికి అన్నదాతలు పండించిన పంటను అమ్ముకునే పరిస్థితి లేదు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ కొనుగోలు లేకపోవడంతో అన్నదాతలు రోడెక్కి రండి బాబు రండి మా ధాన్యం కొనండనే పరిస్థితికి వచ్చారు. ఈ పరిస్థితి ఒక్క చలివేంద్రిలోనే కాదు. జిల్లా వ్యాప్తంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

క్యాష్ కావాలా... ఖాతాలో వేయాలా?

దళారులు క్యాష్ కావాలా... బ్యాంకు ఖాతాలో డబ్బులు కావాలా అని అడుగుతున్నారు. క్యాష్ అయితే 84 కిలోలు రూ.1400 ఇస్తాం. బ్యాంక్ ఖాతా అయితే రూ.1450 ఇస్తామనడంతో ఏం చేయాలో అర్థంకా స్థితిలో ఉన్నాం.

ఎం.ఫకీర్ నాయుడు,
రైతు, నడుకూరు.

ధాన్యం కొనుగోలు లేక అవస్థలు

ధాన్యం కొనుగోలు లేక అవస్థలు పడుతున్నాం. కళ్లాలో ఉన్న పంటను కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ధాన్యం కొనుగోచేసేంత వరకు ఆందోళన తప్పడం లేదు.

డి గోపాలకృష్ణ,
రైతు, చలివేంద్రి



ట్రాక్టర్ ర్యాలీ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ నాయకులు

మద్దతుధరకు చట్టం చేయాలి

26న పార్వతీపురంలో ట్రాక్టర్ ర్యాలీ
రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ తీర్మానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పచెబుతూ ప్రధాని నరేంద్రమోడీ చేసిన చట్టాలు రైతు సంఘాల పోరాటంతో వెనక్కు తీసుకున్నప్పటికీ హామీలు అమలు చేయకపోవడంతో దేశ వ్యాప్తంగా ఈనెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్లతో ర్యాలీలు చేయాలని ఎస్‌కెఎం (సంయుక్త కిసాన్ మోర్చా) పిలుపు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం అఖిల భారత రైతు కూలీ సంగం జిల్లా కార్యదర్శి పి.రమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోడీ తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను రైతాంగం పోరాడి వెనక్కి తిప్పికొట్టినప్పటికీ నరేంద్ర మోడీ దొడ్డిదారిన వ్యవసాయ చట్టాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. అందుకనే అన్ని పంటలకు మద్దతు ధరలు ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం ఇస్తామని అంగీకరించినప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. పంటలకు మద్దతు ధరలు లేకుండా చేసి వ్యవసాయానికి పెట్టుబడులు విపరీతంగా పెరిగేలా అన్ని ధరలు పెంచి అనివార్యంగా రైతులే వ్యవసాయాన్ని వదులుకునేలా బిజెపి ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. అందులో భాగమే ఈరోజు ధాన్యం కొనుగోలు చేయకపోవడం, కానీ ఇతర పంటలకు మద్దతు ధర ఇవ్వకపోవడం కానీ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల పంట రుణాలు రద్దు చేయాలని, విద్యుత్తు మీటర్లు వ్యవసాయానికి పెట్టకూడదని, సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగమంతా జనవరి 26న పార్వతీపురంలో జరిగే ట్రాక్టర్ ర్యాలీకి ట్రాక్టర్లు తీసుకురావాలని రైతాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు గేదెలు సత్యనారాయణ, బి.అప్పారావు, బి.దాసు, కె.రవీంద్ర, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు బొత్స నరసింహరావు, అఖిలభారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మక్కా గౌరు నాయుడు, జాతీయ కమిటీ సభ్యులు పైడార్ భాస్కరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు బి.అప్పలనాయుడు, ఈదుబిల్లి వెంకటనాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎం.భాస్కరరావు, శ్రీను నాయుడు , కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు.

నిర్మాణాలకు ఆటంకం కలిగిస్తే ఫిర్యాదు చేయండి

నిర్దేశించిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - మక్కువ

జగనన్న కాలనీల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల గృహ నిర్మాణ అధికారులు, ఇంజనీరింగ్ సహాయకులతో గృహ నిర్మాణాల పురోగతిపై శుక్రవారం కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మంజూరైన ఇళ్లను సకాలంలో నిర్మించుకోవాలని కోరారు. మక్కువలో ఇళ్ల నిర్మాణ లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేయకపోవడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తహాశీల్దార్‌ను ప్రశ్నించారు. తక్షణమే కాలనీల వారీగా లాటరీ పద్ధతిలో సంబంధిత లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాల్లో అలక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తప్పవన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతను పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్న కృతనిశ్చయంతో ఉందన్నారు. జిల్లాలో 24 వేల ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంగా ఉందని, 9వేల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళికా బద్ధంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశలో ఉన్నాయి, లే అవుట్‌ల వారీగా అడిగి పురోగతిని తెలుసుకున్నారు. నిర్మాణం సామగ్రి ఇవ్వడం లోను, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వద్ద ప్రతి లబ్ధిదారుల పూర్తి సమాచారం ఉండాలని, ఎస్‌హెచ్‌జి రుణాలు రూ.30 వేలు అందించడంలో ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం ఆశించిన పనితీరును సచివాలయ సిబ్బంది చూపాలని, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను సక్రమంగా అందేలా నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు గృహనిర్మాణ సామగ్రి అందివ్వడంలో జాప్యం ఉండరాదని ఆయన పేర్కొన్నారు. ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాల లక్ష్య సాధనలో ప్రగతి కనబర్చిన మార్కొండపుట్టి, పనసభద్ర ఇంజనీరింగ్ సహాయకులు సీతను కలెక్టర్ అభినందించారు. సమీక్షా సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు పి.రఘురాం, తహాశీల్దార్ సూర్యనారాయణ, ఎంపిడిఒ దేవ్ కుమార్, హౌసింగ్ ఎఇ సింహాచలం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలను సమీక్షిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మరీ ఇంత నిర్లక్ష్యమా?

- ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బందిపై ప్రవీణ్ ప్రకాశ్ ఆగ్రహం
- పలు పాఠశాలల్లో తనిఖీలు
- మున్సిపల్ టీచర్‌పై సస్పెన్షన్ వేటు
- ఆర్‌జెడి సహా పలువురు ఇంజినీర్లకు ఛార్జి మెమోలు



బొబ్బిలి.. ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి-బొబ్బిలి, బొబ్బిలి రూరల్

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ చేపడుతుంటే ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా? అంటూ ఉపాధ్యాయులను, నాడు- నేడు పనులు చేపడుతున్న ఇంజినీరింగ్ అధికారులను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ప్రశ్నించారు. బొబ్బిలి పట్టణంలోని మున్సిపల్ పాఠశాలను, పిరిడి, రామభద్రపురం జెడ్‌పి హైస్కూళ్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పిరిడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు, వర్కు బుక్‌లు పరిశీలించారు. జనవరికి ఒకటవ వర్కు బుక్ పూర్తి కావాల్సి ఉన్నా సగం కూడా పూర్తి చెయ్యక పోవడంతో ప్రధానోపాధ్యాయిని బోటు శ్రీదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు ఛార్జి మెమో ఇవ్వాలని ఆర్‌జెడిని ఆదేశించారు. పాఠశాలల్లో విద్య ప్రమాణాలు అధ్వానంగా ఉంటే సిబ్బందిపై ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. చర్యలు తీసుకోలేదని సమాధానం ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అందరినీ సస్పెండ్ చేయాలా? అంటూ హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో ఆర్‌ఒ ప్లాంట్‌ను పరిశీలించారు. అది పని చెయ్యక పోవడం గుర్తించి నాడు-నేడు పనులు చూస్తున్న ఎఇ, డిఇ, ఇఇలకు జిల్లాలో ఇలాంటి ప్లాంట్‌లు ఉన్నాయని అడిగారు. వారు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో వారి ముగ్గురికి ఛార్జీ మెమోలు జారీ చేస్తామని తెలిపారు. అంతకుముందు బొబ్బిలి పట్టణంలోని నరేంద్రదేవ్ మున్సిపల్ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను సక్రమంగా పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్‌జెడి జ్యోతికుమారికి ఛార్జి మెమో జారీ చేస్తామని ప్రవీణ్ ప్రకాష్ చెప్పారు.

అనంతరం వీణల తయారీ కేంద్రాన్ని ప్రవీణ్ ప్రకాశ్ సందర్శించారు.

ఏనుగుల స్వైర విహారం

సచివాలయ తలుపులు ధ్వంసం
భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పరజపాడు సచివాలయం తలుపులను ఏనుగులు ధ్వంసం చేశాయి. గురువారం రాత్రి ఏనుగులు ప్రధాన రహదారి గుండా వచ్చి రహదారి పక్కనే ఉన్న సచివాలయం తలుపులను రాత్రి సమయంలో ధ్వంసం చేసి వెళ్లిపోయాయి. ఏనుగులు సచివాలయం లోపలికి వెళ్లలేకపోవడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదని, లేకుంటే వేలాది రూపాయల విలువ చేసే కంప్యూటర్లు పాడయ్యవని సచివాలయ పంచాయతీ కార్యదర్శి ఆర్ రాజగోపాల్ తెలిపారు. ఏనుగులు ఇలా స్వైరవిహారం చేస్తుండడంతో గ్రామాల్లోకి ఏ రాత్రి సమయంలోనైనా ప్రవేశించి ఇళ్లను కూడా ధ్వంసం చేస్తాయేమోనన్న ఆందోళన ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా జనవరిలో ఎక్కడో ఒకచోట, ఎవరో ఒకరు ఏనుగుల బారినపడి చనిపోతున్నారని, కావున వీటి నుంచి రక్షించాలంటూ ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఏనుగుల సంచారం వల్ల భయంతో పొలం పనులకు వెళ్లలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో ఎటు నుంచి వస్తాయో తెలియడం లేదని, వ్యవసాయ పనుల సమయములో మళ్లీ ఏనుగులు ఈ ప్రాంతానికి రావడం వల్ల పనులను చేపట్టలేకపోతున్నామని రైతాంగం విలవిలలాడుతున్నారు. ఏనుగుల బారిన పడకుండా ప్రభుత్వం, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఏనుగుల గుంపు నుంచి ప్రజలను రక్షించాలి

గుమ్మలక్ష్మీపురం : ఏనుగుల గుంపు నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు నందివాడ కృష్ణబాబు అన్నారు. గత కొన్నేళ్ల నుంచి జియమ్మవలస, కొమరాడ మండలాల్లో అడవి ఏనుగుల గుంపు సంచరిస్తూ పలు రకాల పంటలు, పొలాల్లో మోటార్లు, సమీపంలో ఉన్న ఇళ్లపై దాడి చేసి ఇటు రైతులకు, అటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను నాశనం చేయడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణమే వారికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏనుగులను తరలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జియమ్మవలస మండలం పెదకుదమలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, పరజపాడులో గ్రామ సచివాలయంపై దాడి చేసి తలుపులు ధ్వంసం చేసిన సంఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి ఏనుగుల తరలింపు ప్రక్రియ చేపట్టాలని ఆయన కోరారు.



ఏనుగుల దాడిలో విరిగిపోయిన సచివాలయం తలుపులు

రాష్ట్రంలో దోచుకో దాచుకో..

మాజీ మంత్రి కళా వెంకట్రావు

ప్రజాశక్తి - భామిని

రాష్ట్రంలో దోచుకో... దాచుకో అన్న చందంగా వైసిపి పాలన సాగుతోందని మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు విమర్శించారు. శుక్రవారం స్థానికంగా జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని, కానీ అదే సామాన్యుడి కొనే వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని అన్నారు. మిల్లర్లు రైతుల నుంచి క్వింటాకు ఐదు కేజీల ధాన్యం అదనంగా తీసుకుంటే అడగాల్సిన పాలకులు వారికి మద్దతుగా మాట్లాడడం విడ్డూరమన్నారు. దీంతో రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10 రూపాయలు ఇచ్చి 100 రూపాయిలు లాకొనే పరిస్థితిలో ఉందన్నారు. సామాన్యుడి జీవన స్థితి గురి ఆలోచించే పరిస్థితిలో వైసిపి లేదని విమర్శించారు. దావాస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు రాష్ట్రం ప్రభుత్వానికి కనీసం ఆహ్వానం లేదని, దీంతో రాష్ట్రానికి పెట్టుబడి వచ్చే అవకాశాలు కూడా లేవని, ప్రభుత్వం ఆదిశగా కనీసం ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగం, ఉపాధి అంశాలపై శ్రద్ధచూపడంలేదని, దోచుకో... దాచుకో సంస్కృతిని కొనసాగిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈనెల 27న యువ గళం నారా లోకేష్ 400 రోజులు 4000 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి, బడుగు, బలహీన వర్గ, పేద, నిరుద్యోగుల సమస్యలు తెలుసుకుంటారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి గురించి నిరంతరం తపించే లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన సంక్షేమం, అభివృద్ధి గాలికి వదిలేశారని, సబ్సిడీ, ట్రైకార్ రుణాల ఊసేలేదని, వైసిపి హయాంలో ఐటిడిఎలు నిర్వీర్యం చేసేరాని విమర్శించారు. గిరిజన యూనివర్సిటీ మాటే లేదన్నారు. ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తోట పల్లి ఎడమకాలువకు రూ.109 కోట్లు, జంపారకోట జలాశయానికి రూ.22 కోట్లు, వడ్డంగి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.30 కోట్లు టిడిపి హయాంలో మంజూరు చేసి, శంకుస్థాపన చేస్తే, అనంతరం అధికారం వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని విస్మరించిందని విమర్శించారు. ఇటీవల తలడలో ఏనుగులు దాడిలో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి త్వరితగతిన ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, ఏనుగులు తరలింపుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో భామిని సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, కురుపాం ఇంచార్జి తోయక జగదీశ్వరి, టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, అంపిలి కేశవ, బిడ్డికి ప్రసాద్, కీర్తిరాయి కష్ణచంద్ర దొర, పాల్గొన్నారు.



శంబర గ్రామంలో పర్యటిస్తున్న జెసి ఆనంద్, పోలీసు అధికారులు

సమన్వయంతోనే జాతర విజయవంతం

డ్రోన్ కెమెరాలను ఉపయోగించండి : జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - మక్కువ

అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శంబర పోలమాంబ అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఏర్పాట్లను పరిశీలించేందుకు జెసి ఆ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోకి వచ్చే రహదారులపై ఆయా ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తుపై రేఖా చిత్రం ద్వారా సాలూరు సిఐ ధనుంజయరావు జెసికి వివరించారు. గత రెండేళ్ల జాతర కంటే ఈ ఏడాది భక్తులు తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఇఒ రాధాకృష్ణను ఆదేశించారు. గ్రామంలో ఆలయానికి వచ్చే రహదారులను పరిశీలించారు. క్యూలైన్లను పరిశీలించారు.

700 మందితో పోలీసు బందోబస్తు

జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 700 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. జాతరకు సంబంధించి పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలపై డిఎస్‌పి సుభాష్ జెసికి వివరించారు. గ్రామానికి అన్ని వైపులా 500 మీటర్ల దూరంలో వాహనాల నిలిపివేతకు పార్కింగ్‌కు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే అవాంఛనీయ సంఘటన జరగకుండా కొంతమందిపై బైండోవర్ కేసులు కూడా పెట్టామన్నారు.

పారిశుధ్యం పై దృష్టి పెట్టండి

గ్రామంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని జెసి ఆనంద్ ఆర్‌డిఒ కె.హేమలతకు సూచించారు. జాతర నిర్వహణ అంతా పారిశుధ్యంపై ఎటువంటి ప్రభావం చూపబడ కూడదన్నారు. గోముఖీ నది ఒడ్డున క్యూలైన్ సమీపంలో ఉన్న పందుల గుడిసెలను వెంటనే తొలగించాలని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడు జెసిను కోరారు. పంచాయతీ కార్యదర్శికి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని ఆర్డీవో హేమలతకు జేసీ సూచించారు

పైపులైన్ కాజ్‌వేకు రూ.3లక్షలు మంజూరు

శంబర సమీపంలోని చెముడు వైపు వెళ్లే రహదారిలో గోముఖీ నదిపై రూ.3లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు జెసి ఆనంద్ ఆర్ అండ్ బి అధికారులకు తెలిపారు. వెంటనే ఈ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామంలో ఆర్‌అండ్‌బి రహదారి పనులను పరిశీలించారు. సమస్యపై గత సమీక్షలో పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జెసి ఆదేశంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికినట్లు అయిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మక్కువ ఎస్‌ఐ పైడిరాజు పలువురు అధికారులు పాల్గొన్నారు.


సామాజిక హక్కు పత్రాన్ని గ్రామస్తులకు అందజేస్తున్న పిఒ నవ్య

సామాజిక హక్కు పత్రం అందజేత

సీతంపేట : మండలంలోని కడగండి పంచాయతీలోని కడగండివలసకు సామాజిక హక్కు పత్రాలను శుక్రవారం ఐటిడిఏ పిఒ బి.నవ్య అందజేశారు. కడగండివలసలో పాఠశాల భవనం నిర్మించేందుకు గానూ సామాజిక హక్కు కింద 0.08 సెంట్ల భూమిని అందజేశారు. నాడు-నేడు పనుల కింద పాఠశాల భవన నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా సామాజిక హక్కు కింద ఇచ్చిన భూమిని పాఠశాల వినియోగం కోసం ఉపయోగించాలని పిఒ సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రాము, కడగండి వలస సర్పంచ్ చంద్రరావు, నాయుడుగూడ సర్పంచ్ సాయి తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డును పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ఇఇ శాంతేశ్వరరావు

సిసి రోడ్ల పనులు పూర్తి చేయండి

గుమ్మలక్ష్మీపురం : మన్యం జిల్లాలో సిసిపి నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శాంతేశ్వరరావు సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని జర్న పంచాయతీలో గల రహదారుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులను సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ద్వారా త్వరగా పూర్తి చేయాలన్నారు. సకాలంలో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తే బిల్లులు అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట భద్రగిరి గిరిజన సంక్షేమ శాఖ డిఇఇ సింహాచలం, ఎఇ శ్యాం ప్రసాద్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు ఉన్నారు.


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

బాధిత కుటుంబానికి ఉద్యోగం కల్పించాలి

భామిని : మండలంలోని తాలాడలో ఏనుగుల దాడిలో ఈనెల 16న మరణించిన గోపిచిట్టి చిన్నారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.తిరుపతిరావు కోరారు. బాధిత కుటుంబాన్ని ఆయనతో పాటు సిపిఎం మండల కన్వీనర్ జి.జగన్నాథులు, కొప్పర మిన్నారావు శుక్రవారం పరామర్శించారు. అనంతరం తిరుపతిరావు మాట్లాడుతూ ఏనుగుల దాడిలో మరణించిన చిన్నారావుకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఆ గ్రామంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, ఏనుగుల్ని వెంటనే అక్కడ నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతుల ప్రాణాలతో చెలగాటం వద్దు అని, ప్రభుత్వం వెంటనే స్పందించి చనిపోయిన కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం వెంటనే ఇవ్వాలని కోరారు.

27నుంచి లోకేష్ పాదయాత్ర

గుమ్మలక్ష్మీపురం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో ఈనెల 27 నుంచి చేపట్టబోయే పాదయాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలపాలని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి కోరారు. శుక్రవారం టిడిపి ఇన్‌ఛార్జులతో నారా లోకేష్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. పాదయాత్రకు సంబంధించి ఇన్‌ఛార్జిలకు దిశ నిర్దేశం చేసినట్లు ఆమె చెప్పారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు సుమారు 400 రోజులు పాదయాత్ర సాగుతుందన్నారు. రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి, నిరుద్యోగభృతి తదితర సమస్యలపై పాదయాత్ర ఉంటుందన్నారు.



వాటర్‌ప్లాంటును తనిఖీ చేస్తున్న ఆహారభద్రత అధికారి రమణ

వాటర్ ప్లాంట్లు తనిఖీ

పార్వతీపురంరూరల్ : జిల్లాలో గల వాటర్ ప్లాంట్‌ల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలు జరిపినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి పివి రమణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎంవిఆర్ ఇండస్ట్రీస్, సాయిరాం ఫోర్టబుల్ వాటర్ ప్లాంటుల్లో తనిఖీలు నిర్వహించి నమూనాలు తీసుకొని నాణ్యతా ప్రమాణాల పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. వీరికి గల బిఎస్ఐ, ఐఎస్ఐ, భద్రతా ప్రమాణాల అనుమతులు పరిశీలించారు. వాటర్ ప్లాంట్లలో పరిశుభ్రత పాటించాలని సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టరు బి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

పెదభోగిలిలో గడపగడపకు..

సీతానగరం : మండలంలోని పెదభోగిలి పంచాయతీ, హాడ్కో కాలనీలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైసిపి పరిశీలకులు శోభా హైమావతి పాల్గొన్నారు. తొలుత కాలనీలో గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా వారి గడప వద్దనే కలుసుకుని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్లెట్లను అందచేసి వారు ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండి ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందలేకుంటే వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కాలనీలో గల సమస్యలను సైతం తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జి, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, మండల వైసిపి కన్వీనర్ బొంగు చిట్టి రాజు, నాయకులు బలగ శ్రీరాములు నాయుడు, పోల ఈశ్వర నారాయణ, టి వెంకట అప్పల నాయుడు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఇ-క్రాప్ రైతుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఇ క్రాప్ చేసిన రైతుల వద్ద ఎంత ధాన్యం ఉన్నా కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి నిర్ణయించింది. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో చిన్న లోటుపాట్లు మినహా చక్కగా సాగిందన్నారు. జెసి ఓ.ఆనంద్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో లక్షా 75వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ సంక్రాంతికి ముందుగానే జరిగిందన్నారు. 188 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా సేకరణ చేశామనిచెప్పారు. ఇ క్రాప్ చేసిన రైతుల వద్ద ఎంత ధాన్యం ఉన్నా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. నూతన విధానం ద్వారా జరిపిన ధాన్యం సేకరణపై రైతుల నుంచి వారి అభిప్రాయాలను సేకరించాలని తెలిపారు. ఈ సీజనులో జరిగిన లోపాలను గుర్తించి రబీ సేకరణ కార్యక్రమంలో సరిదిద్దుకొనే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ జెడి కె.రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ రబీకి అపరాలు, చోడి, వేరు శనగ, వరి విత్తనాలు 1170 క్వింటాళ్లను 50 శాతం, 90 శాతం రాయితీపై అందించామన్నారు. 2023 సంవత్సరాన్ని చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించామన్నారు. గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, సీతంపేట మండలాల్లో 90 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశామని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది ధాన్యం దిగుబడి బాగా వచ్చిందన్నారు. జిల్లాలో 1,81,618 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ఇప్పటికే జరిగిందన్నారు. సమావేశంలో నాబార్డు డిడిఎం నాగార్జున, జిల్లా ఉద్యాన అధికారి కె.యస్.ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, జిల్లా సూక్ష్మ నీటి అధికారి ఎల్.శ్రీనివాస రావు, పౌర సరఫరాల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. దేవుళ్ల నాయక్, ఇపిడిసిఎల్ ఇఇ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.వెంకటేష్, మార్కెటింగ్ శాఖ పర్యవేక్షకులు సుధీర్, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆనంద్

3818 క్వింటాళ్ల ధాన్యం తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గల నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 135మంది రైతుల నుంచి 3818క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులకు తరలించినట్టు ఎఎంసి కార్యదర్శి కె.ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పంపిన ధాన్యానికి సంబంధించిన బిల్లు కూడా పంపిన వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయని తెలిపారు. సాంకేతిక కారణాల కారణంగా వే బిళ్ళు సకాలంలో విడుదల కాకపోవడం, రవాణాకు అవసరమైన వాహనాలు లభించక కొద్ది పాటి ఆలస్యం జరుగుతుందనీ లేకుంటే ఈపాటికే మొత్తం ధాన్యం కొనుగోలు, తరలింపు పూర్తి అయ్యేదని అన్నారు.

మార్కెట్ కమిటీ సెస్ కలెక్షన్స్ 90శాతం పూర్తి

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 2022-23ఆర్థిక సంవత్సరంలో రూ.80 లక్షల సెస్ వసూళ్ల లక్ష్యం కాగా జనవరి20నాటికి రూ.70లక్షలు వసూళ్లు పూర్తి చేసి ఖాతాలో జమ చేశామన్నారు. ప్రస్తుతం కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు కొత్తవలస కూడా అదనపు బాధ్యతలు చూస్తున్నట్లు తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులదే బాధ్యత

ప్రజాశక్తి - కురుపాం

పదో తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివించి శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఒ ఎస్‌డివి రమణ అన్నారు. శుక్రవారం గరుగుబిల్లి మండలంలో కొత్తూరు, రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను మౌలిక ప్రశ్నలు వేసి ప్రతి విద్యార్థి పోటీతత్వంతో చదవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి వంట పాత్రలను శుభ్రంగా ఉంచి రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని సిబ్బందికి సూచించారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డిఇఒ

తరగతుల ప్రకారం ఉపాధ్యాయుడి యొక్క పాఠ్యాంశ ప్రణాళికను తప్పనిసరిగా తయారు చేసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి విద్యార్థులకు విద్యపై పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం రికార్డులను పరిశీలించి విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామగోవిందం, సిబ్బంది పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డిఇఒ రమణ

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థిక ఆసరా

ప్రజాశక్తి - సీతంపేట



పెరటి కోళ్ల పెంపకం ద్వారా పౌష్టికాహారంతో పాటు ఆర్థిక స్వావలంబన ఉంటుందని వెలుగు ఎపిడి బి.నారాయణరావు అన్నారు. స్థానిక ఎపిడి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఐటిడిఎ పరిధిలో గల టిపిఎంయు ఏడు మండలాల్లో పెరటి కోళ్ల పెంపకం పథకం ద్వారా 731 యూనిట్లు పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క లబ్దిదారునికి 11 కోళ్లు అందజేశామన్నారు. వీటి వల్ల పౌష్టికాహారంతో పాటు పెంపకం అభివృద్ధి చేసుకొని విక్రయించుకుంటే ఆర్థికంగా ముందుకు వెళ్లవచ్చని అన్నారు. ఈ ఏడు మండలాల్లో 68 వన్ దన్ వికాస్ కేంద్రాలున్నాయన్నారు. వీటి ద్వారా మార్కెటింగ్‌తో పాటు ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలు చేస్తున్నామని తెలిపారు. వాటి ద్వారా ఉత్పత్తిదారుల సంఘాలు ఆర్థికంగా ముందుకు వెళు తున్నాయన్నారు. జీడిపిక్కలకు సంబంధించి రైతులకు ప్రోసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, విక్రయాలకు రైతులకు ఆధారంగా ఉంటామని అన్నారు. బ్యాంకు లింకేజీలు, శ్రీనిధి ఏ స్థాయిలో రుణాలీస్తున్నామో, అదే తరహాలో రికవరీ కూడా జరుగుతుందని తెలిపారు. గతంలో వెలుగు ఆధ్వర్యంలో పైనాపిల్ కూడా కొనుగోలు చేశామని చెప్పారు. మైదాన ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించి, ప్రముఖ పట్టణాల్లో అక్కడ ఉన్న వెలుగు ద్వారా విక్రయించామని తెలిపారు.

ఆశీల వసూళ్లకు 2న వేలం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

2023-24 సంవత్సరానికి మున్సిపల్ రోజువారి ఆశీలు వసూలు చేసుకొనే వేలం పాటను (1-4- 2023 నుండి 31- 3- 2024 వరకు) మునిసిపల్ మార్కెట్, మున్సిపల్ పరిధిలో ఉన్న వివిధ ఏరియాలకు సంబంధించి రోడ్డు మార్జిన్ అశీలు వసూళ్లు చేసుకొనే హక్కుకు సంబంధించి ఫిబ్రవరి 2న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆశీలు వేలంపాటలో పాల్గొనే పాటదారులు ముందుగా మున్సిపల్ కార్యాలయానికి రూ.4లక్షలు దరావత్తు చెల్లించి, రూ.5 లక్షలు సాల్విన్ సర్టిఫికెట్ కార్యాలయంలో అందజేసి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. వీటితో పాటు కబేళాలో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు రూ.25 వేలు దరఖాస్తులు, లక్ష రూపాయల సాల్విన్స్ మున్సిపల్ కార్యాలయానికి అందజేసి ఆశీలు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలంపాటకు సంబంధించిన ప్రతులను మున్సిపల్ కార్యాలయం నోటీసు బోర్డులో రెవెన్యూ అధికారి దిబ్బా రుబెన్, పి.నారాయణరావు, సీనియర్ అసిస్టెంట్ పుష్పలతచే పబ్లిష్ చేయిస్తూ మెరుగైన సమాచారం కోసం కార్యాలయం పని దినాల్లో సంప్రదించాలని సూచించారు.

రహదారి భద్రతను పాటించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

వాహనదారులంతా సురక్షిత ప్రయాణం కోసం తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన రహదారి భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంలో భాగంగా చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులంతా తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని, సురక్షిత ప్రయాణం కొరకు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను పాటించాలని, ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని పాటించాలని, మితిమీరిన వేగం ఎంత మాత్రం సురక్షితం కాదని, కావున ప్రయాణికులంతా రోడ్డు మీదకు వచ్చిన వెంటనే భద్రత ప్రమాణాలు ముఖ్యంగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ జిల్లా అధికారి మల్లికార్జునరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వాహన దారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నోటిఫికేషన్‌లో గందరగోళం

నవోదయ ప్రవేశ పరీక్షకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఆరో తరగతిలో ప్రవేశం కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పుట్టిన తేదీ తగ్గించడంతో వేలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హత కోల్పోతున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు ఈ ఏడాది ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం సిద్ధమవుతున్న సమయంలో నోటిఫికేషన్‌లో పుట్టిన తేదీని ఏప్రిల్ 2011 నుంచి 2013 ఏప్రిల్‌లోపు జన్మించిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. 2013 మే, జూన్, జూలై, ఆగస్టులో పుట్టిన విద్యార్థులు కూడా ఈ ఏడాది ఐదో తరగతి చదువుతున్నారు. వారు కూడా నవోదయ ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నవోదయ నోటిఫికేషన్లు 2013 ఏప్రిల్ 30 నాటికి పుట్టిన విద్యార్థులు మాత్రమే అర్హులని విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పుట్టిన తేదీ ప్రకారం తమ పిల్లలు ఐదో తరగతి ప్రస్తుతం చదువుతున్నారని దీనివల్ల నవోదయ ప్రవేశ పరీక్షకు అర్హత లేకుండా మా పిల్లలు పరీక్ష రాయలేకపోతున్నారని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల మనోధైర్యాన్ని కోల్పోయి ప్రవేశ పరీక్షకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి పుట్టిన తేదీని 2013 ఆగస్టు వరకు ఇవ్వాలని విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నోటిఫికేషన్‌లో మార్పు జరగకపోతే దేశంలో లక్షలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయలేకపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి విద్యార్థుల పుట్టిన తేదీలను మార్పు చేయాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనల మేరకు అంగన్‌వాడీ పోస్టు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని నాయుడు వలసకు చెందిన మినీ అంగన్వాడీ పోస్ట్ నియామకంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి అర్హులైన వారికి ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారుల కుటుంబాల సభ్యులతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని కెమిశిల పంచాయతీ నాయుడువలసలో మినీ అంగన్వాడీ పోస్టుకు ఆరిక సునీత దరఖాస్తు చేసుకున్నారు. అలాగే కొట్టు పంచాయతీ రాయిపురానికి చెందిన పాలక సునీత కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయం ఇలా ఉండగా పాలక సునీత నాయుడువలసకు చెందిన కన్నవారని, రాయిపురంలో తమ అత్త వారు ఇంటి దగ్గర ఉంటుందని ఇలాంటి సందర్భంలో సునీతకు నాయుడువలసలో ఉండేలా రెసిడెన్సీ సర్టిఫికెట్ రెవెన్యూ అధికారులు ఇచ్చినట్టు తెలిపారు. అలాగే అంగన్వాడీ పోస్టు విషయంలో స్థానిక గ్రామంలో ఒక ఇంటి కోడలుగా ఉండాలని నిబంధనలు ఉండగా, నాయుడువలసకు చెందిన కోడలుగా ఉంటున్న ఆరిక సునీతకు మినీ అంగన్వాడీ పోస్ట్ ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయన్నారు. ఇది కాదని రాయిపురంలో కోడలుగా ఉంటున్న పాలక సునీతకు నాయుడువలసలో ఉండేలా రెసిడెన్సీ సర్టిఫికెట్‌ను ఎలా ఇచ్చారో తెలియజేయాలని కోరారు . ఏది ఏమైనా నాయుడువలస మినీ అంగన్వాడీకి సంబంధించిన దరఖాస్తు చేసుకున్న వారిపై పూర్తి స్థాయిలో అధికారులు దర్యాప్తు చేపట్టి అర్హులైన వారికి మాత్రమే పోస్ట్ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రాజ శేఖర్, హర్షవర్ధనం చిన్నారావు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని ఆగ్రిగోల్డ్ కష్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి ఈమేరకు వినతి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్ర చేసిన సందర్భంగా అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు నెలల్లోపు న్యాయం చేస్తానని, వడ్డీతో సహా చెల్లింపులు చేయిస్తానని, కోర్టు కేసులు, యాజమాన్యపు దొంగ సంగతి తారు చూసుకుంటానని హామీ ఇచ్చి ఉన్నారని గుర్తు చేశారు. రూ. 10వేలు, రూ.20వేల లోపు ఇంకా మూడున్నర లక్షలకు పైగా ఉన్న కుటుంబాలకు డబ్బు అందక రోదిస్తున్నారని, రూ.20వేలకు పైగా డిపాజిట్ చేసిన 7 లక్షల కుటుంబాలకు పైగా ఉన్న వారు ఆర్థిక, మానసిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలో న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు, చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి సింహాద్రి దుర్గారావు, అసోసియేషన్ నాయకులు బాసిగాన వెంకటరమణ (చిరు), బంకూరు సత్యం తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం

రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్ల సౌకర్యార్థం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వివిధ ఆసుపత్రుల నుంచి వైద్య నిపుణులు హాజరై డ్రైవర్లకు సేవలందించారు. రక్త నమూనాలు సేకరించి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి షుగర్, బిపి, నేత్ర సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లాకు చెందిన 96 మంది వాహన డ్రైవర్లు, రవాణా శాఖ అధికారులు సిబ్బంది పాల్గొని వైద్య సేవలను పొందారు. డ్రైవర్లలో ఎనిమిది మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు పేర్కొన్నారు. మెడికల్ క్యాంపు ద్వారా అందించే సేవలను డ్రైవర్లు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా రవాణా శాఖ ఉప కమిషనర్ వి.సుందర్ డ్రైవర్లకు, వాహనదారులకు సూచించారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవని అన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి శాఖ తరపున సహాయం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ం ఆర్‌టిఒ ఆదినారాయణ, మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్‌లు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇనస్పెక్టర్లు, వైద్యులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగదీష్ నియామకంపై హర్షం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విజయనగరం, పలాస నియోజకవర్గాలకు టిడిపి పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఎంపిక కావడం పట్ల నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవి కుమార్, దొగ్గ మోహనరావు, కొల్లి తిరుపతిరావు, జె.రవికుమార్, సిరిపురపు భాస్కర్,కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, టి.వెంకటరావు, ధనుంజయరావు, ఉన్నారు.

శ్రీకుమార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని జమదాల గ్రామసర్పంచ్ రెడ్డి ఉమామహేశ్వరరావు (శ్రీకుమార్) సర్పంచ్‌గా, గ్రామానికి, టిడిపి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన మాజీ సర్పంచ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన గ్రామంలోని ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈ సందర్భంగా శ్రీకుమార్ సేవలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డి భారతి, మాజీ ఎఎంసి చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, జాగాన రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీకుమార్‌కు నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

చిదిమిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమిలో 104 ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు పి.ఉమామహేశ్వరి, ఎస్.తనూజ చంటి పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు మధుమేహ, రక్తపోటు ఇతర వ్యాధులకు సంబంధించి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆ గ్రామ ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నవోనమ్మ, ఎఎన్ఎం సరస్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.చిన్నంనాయుడు, టెక్నీషియన్ దినేష్, హెల్త్ అసిస్టెంట్ కె.రవికుమార్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

లోకాయుక్త కేసుల్లో సకాలంలో స్పందించాలి

విజయనగరం : లోకాయుక్త కేసుల్లో వచ్చిన నోటీసులపై సంబంధిత శాఖల అధికారులు సకాలంలో ఆయా కేసులు విచారణకు వచ్చే ముందుగానే సమాధానాలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు ఆదేశించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో విచారణకు రానున్న కేసులకు సంబంధించి నోటీసులకు జవాబులు ఇచ్చే అంశంపై శుక్రవారం తన ఛాంబర్ లో సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను తెలుసుకొని అధికారులకు సూచనలు చేశారు. కలెక్టరేట్ ఎఒ శ్రీకాంత్, విభాగాధికారి నీలకంటరావు తదితరులు పాల్గొన్నారు.